హైదరాబాద్ వార్త



## నృత్య వైభవాన్ని చాటిన హన్విత



రవీంద్రభారతి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త : చిన్నారి హన్విత చేర్యాల తన కూచిపూడి రంగప్రవేశం నృత్యోభినయంతోనే నాట్యప్రతిభను నృత్యవైభవాన్ని చాటుతూ నాట్యగురువు శైలజప్రసాద్‌కు తగిన శిష్యురాలిగా అశేష ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య శుభాశీస్సులందుకొంది. శ్రీశారత నృత్యనికేతన్, హైదరాబాద్ నిర్వహణలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో శనివారం రాత్రి హన్విత కూచిపూడి ప్రదర్శనను శంకరాభరణం రాగం ఆదితాళంలో పుష్పాంజలి అంశంతో ప్రారంభించిచ భో శంభో.. రామదాసు కీర్తన దశావతారాలు, మిశ్రచాపు తాళంలో సిద్ధేంద్రయోగి విరచిత ప్రవేశధరువు భామాకలాపం, తరంగం నీల మేఘ శరీర, జావళి కొమ్మారొవానికి, తిల్లానా తదితర అంశాలను శృతి లయబద్ధంగా హావభావాలను ముగ్ధమనోహరంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు పొందగా, గురు శైజలప్రసాద్ నట్టువాగం, ఎం.శ్రీనివాస్ గాత్రం, శ్రీధరాచార్య మృదంగం, సాయిబాబా వయోలిన్, శ్రీకాంత్ తబల, రమణ వేణువు, ఆర్.సుధాకర్‌ల వాద్య సహకారం ప్రదర్శనను మరింత రక్తికట్టించాయి.

# విజిలెన్స్ తీరుతో అధికారుల్లో అలజడి

### ఏళ్లుగా సాగుతున్న నాలాల పనులు • వానలు రాకుండానే రోడ్లపైకి ఉబికి వస్తున్న నాలాల వ్యర్థాలు

హైదరాబాద్ సెప్టెంబర్ 3 ప్రభాతవార్త : వరుస వర్షాలు వచ్చినప్పుడే మనోళ్లకు నాలాలు గుర్తుకు వస్తాయి. చిన్న పాటి వర్షాలకు కూడా అవి పొంగి పొర్లుతుండడంతో వాహన దారులు తీవ్ర అవస్థలు పడుతుంటటం షరా మామూలుగా మారుతోంది. అఫ్జల్‌గంజ్ నుండి మొదలు పెడితే ముసారాంబాగ్ అంబర్‌పేట, గోల్నాక నుండి అలా నాగోల్ కింది వరకు నాలా ఉప్పొంగి ప్రవహిస్తోంటోంది. ఇటు సికింద్రాబాద్ ప్యారడైజ్ నుండి తీసుకుంటే ఎన్‌టిఆర్ విగ్రహం ఉన్న రసూల్‌పుర వరకు నాలా పనులు నత్తనడకనే సాగుతున్నాయి. దీంతో చిన్నపాటి వర్షాలకే వ్యరాలు పూడుకుపోయి తీవ్ర ఇబ్బందులు తెస్తున్నాయి. కాగా మన గ్రేటర్ అధికారులకు మాత్రం నెల రోజుల్లోనే పూర్తి అవుతాయని చెబుతున్నా ఇప్పటికే ఈ నాలాల పనులు నడువడం ప్రారంభించి నాలుగు నెలలు అవుతోందంటున్నారు నగర వాసులు, కనీసం ఆయా నాలాల్లోని వ్యర్థాలు అయినా పూర్తిగా తీసేసారా అంటే అదీ లేదు. నగరంలో వ్యర్థాల తొలగింపు సగానికి సగం అంటే 50 శాతం కూడా జరుగలేదట. ఇది మనం చెబుతున్న విషయం కాదు. సాక్షాత్తూ విజిలెన్స్ విచారణలోనే తేలింది. అధికారుల అమ్యామ్యాలే కాక కాంట్రాక్టర్ల అక్రమార్గన వెరసి పూడికితీత పనులు అటకెక్కాయంటున్నారు. ఈ వ్యర్థాలను తరలించేందుకు వారు చూపిస్తున్నలెక్కలు ఆశ్చర్యం వేయక మానదంటున్నారు. వ్యర్థలను తలరించేందుకు ఏ వాహనం పడితే ఆ వాహనం వాడినట్లు లెక్కలు చూపుకుంటూ బిల్లులను మాత్రం కోట్లలో చూపిస్తున్నారన్న ఆరోపణలు బాహాటంగానే వినవస్తున్నాయి. 50 నుండి 60 శాతం లోపునే ఈ నాలాల్లో వ్యర్థాలను తొలగించారని విజిలెన్స్ నివేదిక లో పొందుపరిచారు. వాటిలో కనీసం సగం కూడా డంపింగ్ యార్డులకు తరలించలేదని తెలియ వచ్చింది. అన్ని సర్కిళ్లలో ఉన్నతాధికారులు మరీ ముఖ్యంగా డిఈ,ఏఈ లాంటి వారు అంతగా పట్టించుకోక పోవడం వల్ల నాలాల పూడిక తీత ఎక్కడేసిన గొంగళి అక్కడేనన్న చందంగా తయారైందంటున్నారు. ప్రభుత్వానికి మాత్రం తాము వ్యర్థాలను క్రమం తప్పకుండా తీసేస్తున్నామని చెబుతున్నారని, కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ పనులు ఎక్కడా జరగడమే లేదంటున్నారని పలువురు గుర్తు చేస్తున్నారు.



**షరా మామూలుగానే పన్నులు వసూలు !**

చెత్త సేకరణలో భారీగా పన్నులేమీ వసూలు చేయడం లేదని అధికారులు చెబుతున్నారు. అదే పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌నే తీసుకుంటే అక్కడ చెత్త సేకరణ పన్ను వ్యవహారం ముదురుతోందంటున్నారు. ప్రజల నుండి బలవంతంగా పన్ను సేకరణకు ప్రయత్నించడంపై అటు ప్రజా ప్రతినిధుల వద్ద నుండి కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెబుతున్నట్లు తెలిసింది. నివాసాలు వాణిజ్య ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి వద్ద నుండి చెత్త పన్ను ను వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. పేద మధ్య తరగతి ప్రజలు నివసించే కాలనీల నుండి రూ. 30 నుండి రూ. 50 వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. అయితే తెలంగాణలో మాత్రం చెత్త వసూళ్ల ఇందుకు డబుల్ వసూలు చేస్తున్నారని, ఒక్కో ఇంటి నుండి రూ. వంద నుండి రూ. 150 లేదా 200 వరకు కూడా వసూలు చేస్తున్నారని అపార్ట్‌మెంట్ వాసులు చెబుతున్నారు. ఈ కారణంగానే కొందరు చెత్తను గార్బేజ్ కలెక్షన్ వారికి ఇవ్వకుండా రాత్రి పూట ఎవరూ చూడని సమయాల్లో నాలాల్లో కలుపుతున్నామని కొందరు ఓపెన్‌గా చెబుతున్నారు. ఇలా నాలాలు మరింత పూడుక పోయి సమస్యలను మరింత ఎక్కువగా చేస్తున్నాయని మరి కొందరు గుర్తు చేస్తున్నారు.

**ఎక్కడ ఎంత చెత్త తొలగించారు**

వివిధ చోట్ల నాలాలను పరిశీలించిన అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలతో పాటు స్థానికుల నుండి సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలియ వచ్చింది. ఎక్కడ పని చేశారు? ఏ మేరకు వ్యర్థాలను తొలగించారన్న దానిపై వివరాలను సంబంధిత అధికార వర్గాల నుండి తీసుకున్నారంటున్నారు. ఏం చెబితే ఏం అవుతుందోనని కొందరు ఇంజనీర్లు సమాధానమే చెప్పక పోగా నాలుగు ఐదు సార్లు అడిగితే తప్ప విధిలేని పరిస్థితుల్లోనే వారు సమాధానాలు చెబుతున్నారని విజిలెన్స్ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ పరిధిలో ముఖ్యంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు ఏ మేరకు చెత్తను తొలగించారన్న దానిపై గణాంకాలను సేకరిస్తున్నారు. అధికారుల చెబుతున్న లెక్కలు, జవహర్‌నగర్ డంపింగ్ స్టాక్ తీరును బట్టి ఏది నిజం ఏది అబద్ధమన్నది ఇట్టే తేలుతుందని విజిలెన్స్ అంటోంది.

# లీకేజీలతో జాగ్రత్త!

**రెండేళ్లకోసారి తనిఖీ చేయించాలి.. గ్రేటర్‌హైదరాబాద్ పరిధిలో 40లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ప్రతినెలా 18లక్షల వరకు రీఫిల్ బుకింగ్‌లు అవుతుంటాయి. ప్రతి నెల 2వేలకు పైగా కొత్తకనెక్షన్లు తీసుకుంటున్నారు. వినియోగం పెరుగుతున్నంతగా...తనిఖీలు జరగడం లేదు. డిస్ట్రిబ్యూటర్ ఈమేరకు అవగాహన కల్పించడం లేదు. తనిఖీలు చేయించకోవడం ద్వారా ప్రమా దాలు నివారణతో పాటు ఆకస్మాత్తుగా జరిగే ప్రమాదాల్లో నష్టపరిహారం పొందవచ్చు. గ్యాస్ ఏజెన్సీల సమాచారం మేరకు లేదా స్వచ్ఛందంగా వినియోగదారులే రెండేళ్లకోసారి తనిఖీ చేయించాలి. ఇందుకు ఒక్కో ఏజెన్సీ కేవలం రూ.180 నుంచి 240 వసూలు చేస్తుంది. వినియోగదారులు గ్యాస్ పైపు, లైటర్, రెగ్యూలేటర్, పొయ్యి తదితర వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్నవే వాడాలి**

**నాసిరకం వాటితో వంటగ్యాస్ లీకేజీ**

**సిటీలో వరుసగా గ్యాస్ పేలుడు ఘటనలు**

**దృష్టి సారించని ఆయిల్ కంపెనీలు**

**ప్రతిరెండేళ్లకోసారి తనిఖీ చేయించాలంటున్న నిపుణులు**

హైదరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త: నగరంలోని హయత్ నగర్‌కు చెందిన ప్రసాద్ వంట గ్యాస్ బుక్ చేయడంతో సిలిండర్ డోర్ డెలివరీ అయ్యింది. కొత్త సిలిండర్ రీఫిల్‌కు రెగ్యూలేటర్ అమర్చిన కొన్ని గంటల తర్వాత గ్యాస్ లీకేజీ అవుతున్న వాసన వచ్చింది. పైప్‌ను పరిశీలిస్తే అంతా సవ్యంగా కనిపించింది. రెగ్యూలేటర్ కింద నుంచి గ్యాస్ లీకవుతున్నట్లు గమనించి తక్షణమే దానిని తొలగించి తిరిగి సీల్‌మూత బిగించారు. గ్యాస్ ఏజెన్సీకి ఫోన్ చేస్తే మరుసటి రోజు సంబంధిత నిపుణుడు వచ్చి తనిఖీ చేసి సిలిండర్ నాజిల్‌లోని వాచర్‌ను అమర్చాడు. రూ. 300 ఛార్జీలు వసూలు చేశాడు. సిలిండర్ నాజిల్‌లో వాచర్ సమస్య ఎందుకు వస్తుందని అడిగితే వాచర్ నాసిరకంతోపాటు రెగ్యూలేటర్‌తోనూ సమస్యగా పేర్కొన్నాడు. ఇది ఒక ప్రసాద్ సమస్యే కాదు.. నగరంలోని వేలాది మంది వినియోగదారులు గ్యాస్ లీకేజీ సమస్య ఎదుర్కొంటు న్నవారే.. కొత్త సిలిండర్ బిగించే సమయంలో రెగ్యూలేటర్, సిలిం డర్ నాబ్‌ల నుంచి గ్యాస్ లీకవుతూ ఉంటుంది. తాజాగా సిలిండర్ నాజిల్‌ని వాచర్‌నుంచి కూడా లీకేజీలు బయటపడుతున్నాయి. నిపుణులు వచ్చి పరిశీలిస్తే గానీ గుర్తించలేని పరిస్థితి. అప్పటి వరకు సిలిండర్ సీల్‌ను మూసి ఉంచాల్సి ఉంటుంది. ఇటీవల ఇలాంటి ఘటనలు సంభవిస్తున్నాయి. నాజిల్‌లో నాసిరకం వాచర్‌లు అమర్చడం లీకేజీలకు కారణమవుతు న్నాయని కొన్ని సమయాల్లో రెగ్యూలేటర్ ఒత్తిడితోనూ వాచర్ కదిలి గ్యాస్ లీకేజీ అవుతుందని వారంటున్నారు. సిలిండర్ రిఫిల్ సమయంలోనే ఆయిల్ కంపెనీలు వాటిని పరిశీలిస్తే సమస్య



ఉత్పన్నం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే కంపెనీలు మాత్రం కేవలం తాత్కాలిక ఉపశమనం కోసం వాచర్లను మార్చుతుండే తప్ప శాశ్వత పరిష్కారం కోసం చొరవ చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**లీకేజీకి కారణాలు..** ఎక్కువశాతం సిలిండర్, స్టౌవ్‌లను కలుపుతూ ఉండే రబ్బర్ ట్యూబ్ ద్వారా లీకేజీలు ఉంటాయి. ఇది అటు సిలిండర్‌కు, ఇటు స్టౌవ్‌కు అతికే ప్రాంతాల్లో ఏదోఒకచోట నుంచి లీక్ అయ్యే ప్రమాదం ఉంది. సాధారణంగా స్టౌకు అనుసంధానించే చోట వేడివల్ల ఈట్యూబ్ సాగేగుణం కోల్పోతుంది. ఫలితంగా పెళుసుదనం సంతరించు కుని పగుల్లు ఏర్పడతాయి. కేవలం గుండుసూది మొన పరి మాణంలో రంధ్రం ఏర్పడి దీనిలోంచి గంటకు ముప్పావు నుంచి కేజిన్నర వరకు గ్యాస్ లీక్ అవుతుంది. మెల్లమెల్లగా ఇల్లంతా వ్యాపిస్తుంది. ఎల్పీజీకి వ్యాకోచ శక్తి ఎక్కువ, లీకేజీతో వ్యాపించి ఉన్న గ్యాస్‌కు ప్రేరణ లభించగానే ఒక్కసారిగా మంట అంటుకుం టుంది. ఇలా అంటుకున్న సందర్భంలో విస్తరించి ఉన్న గ్యాస్ 12వేల రెట్లు వ్యాకోచిస్తుంది. అంటే కేజీ గ్యాస్ లీకై ఉంటే.. మంట అంటుకున్న వెంటనే అది 12వేల కేజీల వరకు వ్యాకో చిస్తుం ది. ఫలితంగానే గ్యాస్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

## పార్క్ హయత్‌లో ఉత్సాహంగా "పింక్ లెమోనేడ్" వస్త్ర ప్రదర్శన

### భారీగా హాజరైన మహిళలు, చిన్నారులు



శనివారం బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన "పింక్ లెమోనేడ్ " వస్త్ర ప్రదర్శనలో పాల్గొన్న సందర్శకులు, చిత్రంలో నిర్వాహకులు అంకితా సంఘీ, నందితా సురేఖ, సాక్షి గోయెంకా తదితరులు



హైదరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త: మహిళలు, చిన్నారులకు విభిన్న రకాల వస్తువులతో శనివారం బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన "పింక్ లెమోనేడ్" 3వ ఎడిషన్ వస్త్ర ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. సంస్థ నిర్వాహకులు అంకితా సంఘీ, నందితా సురేఖ, సాక్షి గోయెంకా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో కిడ్స్ క్లాతింగ్, ఉమెన్స్ వేర్, స్టేషనరీ, గిఫ్ట్స్, రూమ్ డెకరేషన్ ఐటమ్స్, జ్యూవెల్లరీ, స్లీప్‌వేర్, అలాగే చిన్నారులకోసం టాయ్స్, ఎడ్యూకేషన్ బుక్స్, ప్లే ఏరియా ఇలా 10 విభిన్న రకాల వస్తువులతో 50కిపైగా బ్రాండ్లతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. అలాగే సందర్శకులకు ఉచిత ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా స్టాళ్లను సందర్శించి వస్తువులు కొనుగోలు చేసేందుకు భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చారు.



## అర్ధరాత్రి గణేష్ విగ్రహం చోరీకి యత్నం

**➡ విగ్రహం ఉన్న గది తలుపు బద్దలు కొట్టి మరీ అపహరించే ప్రయత్నం**

**➡ స్థానికులు కేకలు వేయడంతో ఇసుకలో వదిలి పరారీ**



ఇసుక కుప్ప వద్ద విగ్రహాన్ని వదిలేసి వెళ్లిన అగంతకులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన గణేషుని విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడానికి ప్రయత్నించారు. నిందితులు అర్థరాత్రి దాటిన సమయంలో వినాయకుడి విగ్రహం ఉన్న కమ్యూనిటీ హాల్ తలుపులు విరగ్గొట్టి విగ్రహాన్ని ఎత్తుకెళ్తుండగా గమనించిన ఓ వ్యక్తి కేకలు వేయడంతో సమీపంలోని ఇసుక కుప్పలో విగ్రహాన్ని వదిలి పరారయ్యారు. స్థానికంగా తీవ్ర కలకలం రేకత్తించిన ఈ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మీర్‌పేట్‌లోని డిఆర్‌డిఎల్ కాలనీ డ్వాక్రా భవనంలో కాలనీవాసులు వినాయక నవరాత్రి ఉత్సవాల ప్రారంభం రోజు విగ్రహాన్ని ప్రతిష్టించారు. అయితే రెండవ రోజు రాత్రి పూజలు చేసిన కాలనీవాసులు భవనానికి తాళం వేసి వెళ్ళారు. ఇదిలా ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు అర్థరాత్రి దాటిన తర్వాత సుమారు మూడు గంటల సమయంలో తలుపులు విరగ్గొట్టి విగ్రహాన్ని ఎత్తుకెళ్తుండగా బయట గమనించిన ఒక వ్యక్తి దొంగలు.. దొంగలు అని అరిచేసరికి నిందితులు విగ్రహాన్ని అక్కడే ఉన్న ఇసుక కుప్ప వద్ద వదిలి పరారయ్యారు. ఈ మేరకు ఆ వ్యక్తి కాలనీ సంక్షేమ సంఘం నాయకులకు తెలపడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని వనస్థలిపురం ఎసిపి పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు ఉదయ్ భాస్కర్, బద్యానాయక్‌లు పరిశీలించారు.

## కూకట్‌పల్లి జెఎన్‌టియూసి ప్రిన్సిపల్‌గా జయలక్ష్మీ

కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జెఎన్‌టియూసి నూతన ప్రిన్సిపల్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మి పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో జయలక్ష్మి జెఎన్‌టియూసిలో త్రిపుల్ ఈ డిపార్ట్‌మెంట్‌లో సెంటర్ ఫర్ ఎనర్జి స్టడీస్‌లో కో ఆర్డినేటర్‌గా పనిచేశారు. గతంలో పారిశుద్ధ్య పరిశుభ్రత అనే అంశం తీసుకొని ఇద్దరు పీజీ విద్యార్థులతో కలిసి ఆమె మూసీ నది పరివాహక ప్రాంతాల్లో ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడంపై సాంకేతిక పరిశోధన చేసింది. ఇందుకుగాను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా లీలావతి అవార్డును జయలక్ష్మి అందుకోవడం జరిగింది. విద్యార్థులు భవిష్యత్తుకు గట్టి పునాది వేసేందుకు తమ వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా జయలక్ష్మి తెలియజేశారు.

## మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య

దుండిగల్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: మద్యం మత్తులో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట్ ఇందిరమ్మ కాలనీ బ్లాక్ 12లో నివాసం ఉంటున్న కార్వత్ భీంరావు కుమారుడు గంగాధర్(30) బేకరీలో పని చేస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం పని మానేసి మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గంగాధర్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గంగాధర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

ఉప్పల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త : అనుమానాస్పదస్థితిలో ఒక మహిళ మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా ఎనుగొండ బిసి కాలనీకి చెందిన కేతావత్ లక్ష్మణ్‌నాయక్ కుమార్తె కేతావత్ శ్రావణి 21 బాల్యంలో ప్రేమ వివాహం చేసుకుంది. అయితే అప్పటి నుంచి ఆమె తండ్రి వారి కుటుంబాన్ని విడిచి పెట్టినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం ఆమె తల్లి కూడా మృతి చెందినట్లు తెలిపారు. చిన్నతనం నుంచే శ్రావణి మూర్ఛ వ్యాధితో బాధపడుతుందని, ఆసుపత్రిలో మందులు తీసుకుంటుందని తెలిపారు.ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. ఇదే క్రమంలో మద్యానికి బానిసగా మారినట్లు తెలిపారు. గతనెల 31వ తేదిన ఇంట్లో శ్రావణి నిద్రపోతున్నట్లు పడి ఉందని, ఆమె వద్దకు వెళ్లి పరిశీలించగా అపస్మారకస్థితిలో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.దీంతో ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మానసికంగా కుంగిపోయి తాగిన మత్తులో మూర్ఛ మందులు తీసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పండుగలు ఘనంగా జరుపుకునేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



బోనాల ఉత్సవాలకు మంజూరైన చెక్కులను అందజేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త: తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాల, పండుగలు గొప్పగా జరుపుకోవాలనే ఉద్ధేశంతో ముఖ్య మంత్రి కేసిఆర్ బోనాల ఉత్సవాలకు ప్రత్యేక నిధులు విడుదల చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో సనత్‌నగర్ నియోజక వర్గంలోని వివిధ అమ్మవారి దేవాలయాల బోనాల నిర్వాహన కోసం మంజూరైన 12 లక్షల రూపాయల చెక్కులను మంత్రి తలసాని చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తెలంగాణలో అన్ని పండుగలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. తెలంగాణ సాంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు కురుమ హేమలత, కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరీ, మాజీ కార్పోరేటర్లు ఆకులరూప హరిక్రిష్ణ, ఉప్పల తరుణి, శేషుకుమారి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్లు క్రిష్ణ, శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

**మోండా మార్కెట్ ఇస్లామియా స్కూల్, రామ్ గోపాల్‌పేట్ డివిజన్లలో** నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునీక టాయిలెట్స్‌ను మంత్రి తలసాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్లు ఆకులరూప, అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు నాగులు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో తెలంగాణనే అగ్రగామి

**కేంద్రం మా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నది : ఎంపి రంజిత్‌రెడ్డి**



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో లబ్దిదారులకు నూతన ఆసరా పించన్లు పంపిణీ చేస్తున్న ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లు

నార్సింగి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త : అన్ని రంగాలలో తెలంగాణ రాష్ట్రమే దేశంలో అగ్రగామిగా ఉందని చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో కలిసి "నూతన ఆసరా పించన్ల పంపిణీ" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా పలువురు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పించన్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి ఎంపి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ సమైఖ్య రాష్ట్రంలో రూ.200 ఉన్న పించన్‌లను రూ.2016కు, వికలాంగులకు రూ.500 నుంచి రూ. 3016లకు పెంచిన ఘనత మన సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆసరా పించన్ల ద్వారా వృద్దులకు పెద్ద కొడుకుగా, కేసీఆర్ కిట్ల ద్వారా నవజాత శిశువులకు తాతగా, కళ్యాణలక్ష్మి ద్వారా ఆడ పడుచులకు మేన మామగా సీఎం మారి పేదల గుండెల్లో దేవుడిగా నిలిచారన్నారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ప్రపంచంలో రైతులకు పంటల పెట్టుబడి కోసం రైతుబంధు కింద ఎకరానికి రూ.పదివేలు ఇస్తున్నది ఒక్క తెలంగాణలోనే అని వివరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్, కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, టీఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, సహకార సంఘం అధ్యక్షులు రాందాస్, కార్పోరేటర్లు సాగర్‌గౌడ్, భూపాల్‌గౌడ్, ప్రశాంత్ నాయక్, అనితా వెంకటేష్, పద్మావతి పాపయ్య, జగదీష్ సీనియర్ నాయకులు రాంప్రసాద్, నాగరాజు, వెంకటేష్, సుమన్‌గౌడ్, రత్నం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**పార్లమెంట్‌లోనే కేంద్రానికి జవాబు చెబుతాం : ఎంపి**

మేము అడిగిన ప్రశ్నలకు జవాబు దాటవేస్తున్న కేంద్ర మంత్రులకు పార్లమెంట్‌లోనే జవాబు చెబుతామని ఎంపి రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడిన తీరు బాగా లేదన్నారు. కేంద్రం ఫక్తు రాజకీయ కోణంలోనే కేంద్ర మంత్రులు మాట్లాడడం సరైంది కాదన్నారు. మేము కేంద్రానికి ఎంత పంపిస్తున్నాము, తిరిగి మన రాష్ట్రానికి ఎంత పంపిస్తున్నారో లెక్కలు చెప్పాలని అడిగితే సమాధానం చెప్పకుండా తోక ముడిచారన్నారు. కేంద్రం ఏమి చేస్తుంది? రాష్ట్రం ఏమి చేస్తుందో? ప్రజలకు బాగా తెలుసని, ప్రజా కోర్టులోనే సరైన తీర్పు వస్తుందని రంజిత్‌రెడ్డి తెలిపారు.

# నిరుపేదలకు సేవ చేయడమే ఎన్ఆర్ఎఫ్ లక్ష్యం

## ఫౌండేషన్ వ్యవస్థాపకులు నక్కా రవీందర్

**హైదరాబాద్, సెప్టెంబరు 2, ప్రభాతవార్త :** గత 30సంవత్సరాలుగా ప్రజా సేవలో ఉన్న తనకు ఒకవేదిక లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయలేకపోతున్నామని అందుకే ఎన్ఆర్ఎఫ్ ఫౌండేషన్ స్థాపించినట్లు వ్యవస్థాపకులు రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్క రవీందర్ అన్నారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవచేయడమే లక్ష్యంగా ఈఫౌండేషన్ ఏర్పాటు చేసామన్నారు. అలాగే పేదలు ఎక్కడ బాధల్లో ఉన్నా తాను అందుకుంటానన్నారు. న్యాయవాద వృత్తిలో గత 30 సంవత్స రాలుగా ఎంతోమందికి తాను సాయం చేసినట్లు తెలిపారు. పేదవారికి కోర్టు కేసుల్లో ఇరుక్కుంటే ఉచితంగా న్యాయం అందిస్తానని ముమ్ముందు జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి కమిటీల ఆధ్వర్యంలో న్యాయ సలహాల కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అన్ని జిల్లాల్లో 10వ తరగతి, ఇంటర్ టాపర్లకు రివార్డులు, మహిళలకు ఎలాంటి సాయం కావాలన్నా ముందుండి చేస్తామన్నారు. కుల,మత,ప్రాంతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు విస్తతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రోజా, జగన్నాథం, లక్ష్మణ్ , రామిరెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఫౌండేషన్ లోగో ఆవిష్కరిస్తున్న నక్క రవీందర్

# ముత్యాల వంటి సూక్తుల కవితాసంపుటి 'ఆణిముత్యాలు'

**చిక్కడపల్లి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** ముత్యాల వంటి సూక్తులతో రచయిత నరసింహారావు 'ఆణిముత్యాలు' మినీ కవితా సంపుటిని అందించాని కేంద్ర సాహిత్య అకాడమి సలహాసంఘం సభ్యులు ఆచార్య ఎస్వీ.రామారావు అన్నారు. కెవిఆర్ ప్రాజెక్ట్స్, ఇన్‌ఫ్రాడెవలప్పర్స్ సౌజన్యంతో చౌదూరి కళాపీఠం, శ్రీ త్యాగరాయ గాన సభ, శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు చౌదూరి నరసింహారావు రచించిన 'ఆణిముత్యాలు' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వాహకులు రఘుశ్రీ, బండారు రామచంద్రరావు, చౌదూరి పద్మావతి ఆధ్వర్యంలో జరిగింది. సభకు గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి అధ్యక్షత వహించగా గ్రంథాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆచార్య ఎస్వీ.రామారావు మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో విజయానికి సోపానాలు ఈ ఆణిముత్యాలు అని అభివర్ణించారు. సులువైన పదాలతో అర్థవంతగా కవితలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కెవిఆర్ ప్రాజెక్ట్స్, ఇన్‌ఫ్రాడెవలప్పర్స్ చైర్మన్ కె.వెంకటకృష్ణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆయ్యగారి ప్రభాకరరెడ్డి, కవనవేదిక అధ్యక్షుడు ఉమ్మడిశింగు రాఘవరావు, రచయితలు నర్మదారెడ్డి, డాక్టర్ లలితావాణి తదితరులు పాల్గొన్నారు.


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎస్వీ.రామారావు

# విఆర్ఏలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే అసెంబ్లీ ముట్టడిస్తాం

## బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా విఆర్ఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని బిసి పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అసెంబ్లీ ముందున్న గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద మీడియాతో మాట్లాడుతూ విఆర్ఏలకు పేస్కేలు అమలు చేస్తామని ,55 సంవత్సరాలు దాటిన వారి వారసులకు ఉద్యోగాలు ఇస్తామని అర్హులైన వారికి పదో న్నతి కల్పిస్తామని సిఎం కెసిఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు స్పందన లేదన్నారు. సిఎం హామీల అమలుకు వీఆర్ఏలు గత 41రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరించడం సమంజసం కాదని మండిపడ్డారు. విఆర్ఏల డిమాండ్లపై నిర్ణయం తీసుకోకపోతే బిసి పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో విఆర్ఏలతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో తెలంగాణ సామాజిక సమితి రాష్ట్ర అధ్యక్షులు కొటికె రాము ముదిరాజ్, జెఏసీ నాయకులు శశికుమార్‌గౌడ్, అరవింద్‌చారి, మహేందర్ నాయుడు, శేఖర్‌గౌడ్, కట్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న యుగేందర్‌గౌడ్

# కు.ని ఆపరేషన్ మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి

## - పౌరహక్కుల సంఘం కార్యదర్శి ఎన్.నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్

**నాంపల్లి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం పిహెచ్‌సిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స వికటించి నలుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాల్లో వారి భర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కోటి రూపాయల నష్టపరిహారంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనను రాష్ట్ర హైకోర్టు సుమోటోగా స్వీకరించి బాధితలకు న్యాయంచేసి బాధ్యులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ఘటనకు పూర్తిబాధ్యత వహిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి తన్నీరు హరీష్‌రావు వెంటనే రాజీనామా చేయాలని నారాయణరావు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ పౌరహక్కుల సంఘం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో నిజనిర్ధారణ కమిటీ మృతిచెందిన లావణ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు సీతారాంపేట గ్రామానికి వెళ్లినట్లు, ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలో కనీస వసతులు కూడా లేనట్లు కమిటీ గుర్తించినట్లు తెలిపారు. సదరు ఆపరేషన్లపై క్యాంప్ ఇన్‌ఛార్జ్ నాగజ్యోతిని ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆగ్రహించారు. ముమ్ముందు ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తక్షణం చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కానీ, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలలో కానీ కనీస మౌళిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. చనిపోయిన నలుగురు తల్లులకు చిన్నపిల్లలు ఉన్నందున వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తగునిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పి.ఎం.రాజు, టి.లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరావు, రాజు


కళాకారులతో అతిథులు తిరుపతిరావు, పీసుపాటి, జలంధర్‌రెడ్డి, ఓంప్రకాష్

# శిఖరాయమానం శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం

**నాంపల్లి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** వినాయక చవితి నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సౌజన్యంతో చౌడేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన అద్భుతంగా ప్రదర్శింపబడి వేడుకలకే శిఖరాయమానంగా నిలిచింది. శ్రీకృష్ణగా బి.నారాయణస్వామి, దుర్యోధనుగా సిహెచ్.బి.నాగేశ్వరరావు, కర్ణగా మల్లాది వెంకటరమణ, వికర్ణగా సిహెచ్.వి.ఆర్.మూర్తి, విధురగా పి.కోటేశ్వరరావు, ధృతరాష్ట్రగా వి.ఎల్.నర్సింగరావు, గాంధారిగా పి.సావిత్రి, భీష్మగా పి.శేఖరుడు, ద్రోణగా ఎం.ఆర్.మోహన్‌రావు, అశ్వద్ధామగా పి.మంగపతిరావు తదితరులు ఆయా పాత్రలకు ప్రాణంపోయగా బి.పరమేష్ ఆహార్యం, ఎన్.భాస్కరరావు సంగీతం, మల్లాది శ్రీసాయి హరీష్ నిర్వహణ శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటక ప్రదర్శనను మరింత రక్తికట్టించి విచ్చేసి అశేష ప్రేక్షకులు, రంగస్థల ప్రేమికులను అలరించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న వెల్ఫేర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్లు తిరుపతిరావు, వి.పీసుపాటి, జలంధర్‌రెడ్డి, ఓంప్రకాష్, రామిరెడ్డి తదితరులు పౌరాణిక పద్యనాటకాలు తెలుగుజాతి స్వంతమని, ఈ నాటక ప్రదర్శనల ద్వారా మన కళలు, ప్రాచీన సంపద, సంప్రదాయాలను కాపాడుతున్న రంగస్థల కళాకారులను అభినందించి, తమ పాత్రోచిత నటనతో ఆనాటి ప్రముఖ రంగస్థలనటులు రఘురామయ్య, పీసుపాటి, ఎ.వి.సుబ్బారావు తదితరులను గుర్తుచేశారంటూ కొనియాడుతూ ఘనంగా సత్కరించారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**చార్మినార్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సౌత్‌జోన్ డిసిపి పి.సాయి చైతన్య అన్నారు. తెలంగాణ ఉర్దూ ఫోరమ్, మజర్ ఎడ్యుకేషన్ సొసైటీ, హుమన్ రైట్స్ డె వలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసి యేషన్‌ల సంయుక్త ఆధ్వ ర్యంలో శనివారం ఖిల్వత్ లోని ఉర్దూ మస్కాన్‌లో నిర్వహించిన జాతీయసమైక్యత కార్యక్రమానికి డిసిపి సాయి చైతన్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివితే అశించిన రంగాల లో విజయం సాధిస్తారని తెలిపారు. డిసిపి సాయి చైతన్యకు చార్మినార్ మెమోంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ ఫోరమ్ అధ్యక్షులు అన్సారీ, మిస్ ఆసియా సుధాజైన్, భార్గవి, వినయ్ కిశోర్ యాదవ్, అస్గర్ హుస్సేన్, ఆషా పాల్గొన్నారు.



పాల్గొన్న సౌత్ జోన్ డిసిపి సాయి చైతన్య

# వైభవోపేతంగా 'అన్నపూజ'

**చిక్కడపల్లి :** ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి దేవాలయంలో 'అన్నపూజ' జరిగింది. ఆలయ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు ఎవిఎస్.రమణమూర్తి, జి.హరిత, ఓ.మోహన్‌రావు, సి.వెంకటగోవిందరావు, సిహెచ్.రాజా శ్రీనివాస్, కె.హనుమంతరావు, డాక్టర్ ఎన్.వెంకటరమణరావు, కె.రాజు, జె.సురేఖ, పి.అరుణశ్రీ, కె.స్వరూప, బి.శివకుమారి, ఆలయం పూర్వ చైర్మన్ బిఎన్.శ్రీనివాస్‌రావు యాదవ్, పాల్గొన్నారు.

# విద్యుత్ ఉండని ప్రాంతాలు

**జీడిమెట్ల, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** జీడిమెట్ల సబ్‌స్టేషన్ 1,4 పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా జీడిమెట్ల డివిజన్‌లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పత్రికా ప్రకటనలో తెలిపారు. షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్,ఎపిఐఐసీ కాలనీ, న్యూ షాపూర్‌నగర్, కళావతి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబ డుతుంది. కావున ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

**నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పత్రికా ప్రకటనలో తెలిపారు. 3/11కేవీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మధురానగర్, ప్రశాంత్‌హిల్స్ కాలనీ,బృందావన్ కాలనీ, న్యూ శ్రీనివాస కాలనీ, బండారీ లేఅవుట్ తదితర ప్రాంతాలలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. కావున ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

# తెలంగాణను సంక్షేమ, అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌దే

**నిజాంపేట్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1,002 మందికి ఆసరా ఫించన్ కార్డులను శనివారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 46లక్షల పెన్షన్లను అందజేస్తూ పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. వృద్ధులు,వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతవులకు ఆసరా ఫించన్ ద్వారా వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు.తెలంగాణ ప్రజల అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన నాయకుడు కేసీఆరేనని, తెలంగాణ అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌ను చూసి ఓర్వలేక బీజేపి,కాంగ్రెస్ పార్టీలు విమర్శిస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజల సంక్షేమానికి అములు చేసిన సంక్షేమ పథకాలు బీజేపి, కాంగ్రెస్ పార్టీలు నాయకత్వం వహిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించవని ఎద్దేవా చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణను అన్ని రంగాలను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఫించన్ అందించే భాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.ఈ ఫించన్ పంపిణీలో మేయర్ కొలన్ నీలా గోపాల్‌రెడ్డి, డిప్యూటి మేయర్ ధన్‌రాజ్, కమిషనర్ వంశీకృష్ణ, టీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


ఫించన్ కార్డులను అందజేస్తున్న కెపి వివేకానంద్

# బంద్ ప్రశాంతం...

**గోషామహల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్‌పైన అక్రమంగా పిడియాక్టు నమోదు చేసి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ శ్రీరామ్ యువ సేనా ఆధ్వర్యంలో శనివారం గోషామహల్ నియోజకవర్గంలో వ్యాపారులు, స్వచ్ఛందంగా షాపులు మూసి వేసి బంద్‌చేశారు. నియోజకవర్గంలోని మహరాజ్‌గంజ్, ముక్తార్‌గంజ్, కిషన్‌గంజ్, ఉస్మాన్ షాహి, అశోక్‌బజార్, గౌలిగూడ, పిష్‌మార్కెట్, సుల్తాన్‌బజార్, బడిచౌడి, అబిడ్స్ తదితర ప్రాంతాలల్లో మార్కెట్‌ల్లోని వ్యాపారులందరూ స్వచ్ఛందంగా దుకాణాలను మూసిబంద్‌కు మద్దతు పలికారు. దీంతో గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని ప్రధాన కూడలిలోని ఎక్కడ చూసినారహదారులు బోసిపోయాయి.ముందు జాగ్రత్త చర్యగా గోషామహల్ నియోజకవర్గంలోని షాహినాయత్‌గంజ్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్, మంగళ్‌హాట్, హాబీబ్‌నగర్, అబిడ్స్, సుల్తాన్‌బజార్ పోలీసు స్టేషన్ల పరుధుల్లో సమస్యాత్మకమైన ప్రాంతాల్లో కూడా పోలీసు పికెట్లు ఏర్పాట్లు చేశారు. అదనపు పోలీసు బలగాలను మోహరింపచేశారు.

# ఓ.యూలో ప్రశాంతంగా ముగిసిన ఔట ఎన్నికలు

**తార్నాక, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔట) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిసాయి. రికార్డు స్థాయిలో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆర్ట్స్ కాలేజ్‌లో ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ. రవీందర్ యాదవ్, ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొ.లక్ష్మీనారాయణ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11 పోలింగ్ బూత్‌లల్లో ఎన్నికలు నిర్వహించారు. 97.47 శాతం మంది ఓటు హక్కులను వినియోగించుకున్నారు. 395 మంది ఉపాధ్యాయులకు 985 ఓటును వేశారు.

# ఇండ్ల పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న పుస్తె శ్రీ కాంత్

**చార్మినార్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** మొక్కలు నాటడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని, ప్రజలు తప్పకుండ తమ ఇండ్ల పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్ అన్నారు. పురానాపుల్ డివిజన్ పరిధిలోని పార్దవాడలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆయన శనివారం సీనియర్ టిఆర్ఎస్ నాయకురాలు గుంటి మంజుల రాణితో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యం బారిన పడకుండ ఉండటానికి చెట్లు అన్ని విధాల ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిఆర్ఎస్ నాయకురాలు మంజుల రాణి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కులదీప్ కౌర్ పాల్గొన్నారు.

# దేశంలో కులవివక్ష కొనసాగుతూనే ఉంది

**చిక్కడపల్లి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :** దేశంలో ఇంకా కులవివక్ష కొనసాగుతూనే ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయవిభాగం డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బాగ్‌లింగంపల్లిలోని కాకా అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం జరిగింది. స్టేట్ లాసెట్ పీజీ టాపర్స్‌ను సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ న్యాయ విద్యార్థుల కు పట్టాలు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించి ప్రసంగించారు. పూర్వ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, అంబేద్కర్ విద్యాసంస్థల చీఫ్ ప్యాట్రాన్, విశాఖ ఇండస్ట్రీస్ ఎండి సరోజా వివేక్, సంయుక్త కార్య దర్శి పి.వి. రమణకుమార్, డైరెక్టర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన పాల్గొన్నారు.

# కొనసాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు


పూజలో పాల్గొన్న కార్పొరేటర్ కొంతం దీపిక


పూజలో పాల్గొన్న నందకిశోర్‌వ్యాస్


పూజలో పాల్గొన్న డిసిపి రాజేష్‌చంద్ర


పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** వెస్ట్ మారేడ్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణేష్ మండపంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, తెలంగాణ ఉద్యమ కారుడు పెద్దాల నర్సింహ్మా యాదవ్‌లు పాల్గొని పూజలు చేశారు.

**వల్లాబాయ్ పటేల్ :** అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని ఎస్.జి.ఎఫ్ చైర్మన్, టిఆర్ఎస్ నేత ఎన్. శ్రీగణేష్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కంటోన్మెంట్‌లోని వల్లాబాయ్ పటేల్, మారేడ్‌పల్లి, కాంట బస్తీ, భవానీ కాలనీ, చిన్న కమేళా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పేదలకు అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.


అన్నదానం చేస్తున్న శ్రీగణేష్ తదితరులు

**అడ్డగుట్ట :** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కంటోన్మెంట్ బోయిన్‌పల్లి భావన కాలనీ అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో ప్రతిష్టించిన గణేష్ మండపాల్లో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు ఎసందీప్, బంటూ, సన్నీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**సంజీవరెడ్డి నగర్ :** బల్కంపేట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని అమీర్‌పేట టి.ఆర్.ఎస్ శ్రేణులు అందరు ఏకధాటిగా పాల్గొని శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట టిఆర్ఎస్ అధ్యక్షుడు హనుమంతరావు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, బీజేపి నాయకులు తాల్ల జైహింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**చిక్కడపల్లి :** గాంధీనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్ బస్తీలో ఎండి.కృష్ణ, ఆనంద్‌రావు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, బిజెపి ఓబీసీ సెల్ జాతీయ కార్యవర్గసభ్యుడు పూస రాజు, బస్తీ నాయకులు ఎల్లమ్, రాజయ్య, సాయికుమార్, జాన్, శ్రావణ్, కెఆర్. సదానంద్, టిఆర్ఎస్ నేతలు ఎం.రాకేశ్‌కుమార్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠా నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**గోషామహల్ :** గోషామహల్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలల్లో నెలకొల్పిన వినాయక ప్రతిమలకు టిఆర్ఎస్ నాయకులు నందకిశోర్‌వ్యాస్, ఆర్వీమహేందర్‌కుమార్‌లు ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో మధ్య పూజలు చేసి అన్నదానాలు చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు టిఆర్ఎస్ నాయకులు నందకిశోర్‌వ్యాస్, ఆర్వీమహేందర్, మీసాలక్రాంతి, అనిత, శంకర్‌లను సన్మానించారు.

**అఫ్జల్‌గంజ్ :** నాంపల్లి పటేల్‌నగర్‌లో వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో సెంట్రల్ జోన్ డిసిపి రాజేష చంద్ర, అబిడ్స్ ఎసిపి వెంకట్‌రెడ్డి, బేగంబజార్ సిఐ శంకర్‌లు పాల్గొన్ని వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు జగపతిశేఖర్, జగపతి మహేష్, లల్లూ, వీరేష్, అరుణ్, వెంకటేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న జంపనప్రతాప్

**గన్‌ఫౌండ్రి :** ప్రసాద వితరణ వేదికకు అనుమతి ఇవ్వాలని కోరుతూ అబిడ్స్ సిఐ ప్రసాద్‌రావుకు వినతిపత్రం అందచేసిన తెలంగాణ భజరంగ్ సేనా ప్రతినిధి బృందం. ఈ సందర్బంగా లక్ష్మన్ రావుగుప్త మాట్లాడుతూ ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా వినాయక ఉత్సవాల్లోభాగంగా ఈనెల 9వ తేదిన జరిగే వినాయక నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు అబిడ్స్ ప్రాంతంలో వేదికవేసి ప్రసాద వితరణ చేయడం జరుగుతుందన్నారు.

**తార్నాక :** నగరంలో ప్రశాంత వాతావరణంలో గణనాదుడి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు జరుపుకుంటున్నారని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. లాలాగూడ ఇందిరానగర్‌లో శ్రీశ్రీ సిద్ది వినాయక యూత్ అసోషియేషన్ గణనాథుడిని ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రంలో భక్తులకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి,లింగాని శ్రీనివాస్, రామేశ్వర్‌గౌడ్, కిషోర్ గౌడ్, కిరణ్ గౌడ్, రామేశ్వర్ గౌడ్,సిహెచ్.సునిల్ ముదిరాజ్, నాగేశ్వర్‌గౌడ్, గీతా దయాకర్, అసోషి యేషన్ అధ్యక్షులు పాలకుర్ల ముఖేష్‌గౌడ్, నక్క మధు, శివకుమార్, సంతోష్ పాల్గొన్నారు.

**పేట్‌బషీరాబాద్ :** కుత్బుల్లాపూర్ నియోజకవ్గం జీడిమెట్ల డివిజన్ పరిధి కుత్బుల్లాపూర్ గ్రామంలో రాజీవ్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.ఎం ప్రతాప్ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**మెహిదీపట్నం :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మరియు ఈశాన్యరాష్ట్రాల అభివృద్ధిశాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి కోరారు. గుడిమల్కాపూర్ డివిజన్ శివభాగ్‌లో గాయత్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆజాదీకా అమృత్ మహోత్సవం మండపంలో కొవుదీరిన గణనాథున్ని మంత్రి కిషన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్, గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ స్థానిక నేతలు వి. భుజేందర్‌కుమార్, దేవర శ్రీనివాస్, అనీల్, నామ యాదగిరినేత, శ్రీకాంత్‌సాగర్, సుధాకర్‌యదవ్, వెంకటేష్ భక్తులు ఉన్నారు.


ప్రత్యేక పూజలు చేస్తున్న తెరాస శ్రేణులు


అన్నదానం ప్రారంభిస్తున్న ముఠాగోపాల్


వినతి పత్రం సమర్పిస్తున్న ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త


అన్నదానం చేస్తున్న కె.ఎం ప్రతాప్


పూజలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

# ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**గోషామహల్, సెప్టెంబర్ 3, ప్రభాతవార్త :** ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మెట్రోపాలిటన్ లీగల్ సర్వీస్ కార్యదర్శి రాధిక జైస్వాల్ హెచ్చరించారు. శనివారం గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పురానాపూల్ చౌరస్తా నుండి వివిధప్రాంతాలకు వెళ్లే ఆటోరిక్షా డ్రైవర్లుకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. నంబర్‌లేని వాహనాలను నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ధనలక్ష్మి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకోకుండా సంవత్సరాల తరబడి, తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తో వాహనాలు నడిపితే యాజమానులపై ఐపిసి 420, మోటార్ వెహికల్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో గోషామహల్ ట్రాఫిక్ టిటిఐ అధికారులు, పోలీసు సిబ్బందితోపాటు ఆటోడ్రైవర్లు అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న మెట్రోపాలిటన్ లీగల్ సర్వీస్ కార్యదర్శి రాధిక జైస్వాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.ధనలక్ష్మిలు

**PUBLIC NOTICE**

The General Public hereby informed my client Mrs. Zeenath Begum W/o Mr. Md. Sarfaraz, has entered into an Agreement of Sale for purchase of schedule mentioned property below from **V. RAVI SHANKAR GUPTA, S/o Late Sri. V. GURU MURTHY** and paid substantial sale consideration amount if any legal heir/family member/Person/s or anybody whom so ever having any sort of objection or rights over the said property by virtue of inheritance may contact within 7 days from the date of publication of this notice. If no objections are received, my client will proceed with further sale transaction, thereafter no claims, objection, will be entertained .

**SCHEDULE OF PROPERTY**

All that H.No.1-8-726 (59/2RT), admeasuring 166.13 Sq.yards, consisting of Ground Floor, First Floor, Second Floor and Third Floor, situated at Prakasham Nagar (Garibnagar), Begumpet, Secunderabad and bounded by North: House No.58/2RT, South: House No.60/2RT, East: Road, West: House No.56/2RT.

**Sd/- M. I. Ahmed**
**Advocate**
B.Com.LLB (DCA)
H.No.11-4-322/1 /1/A/6, Srinivas Nagar Colony, chilkalguda, Sec-bad Cell No. 8309859660
Mail: ahmedadvocate786@yahoo.com

## గణనాథులకు ప్రత్యేక పూజలు : రాంరెడ్డి



గణనాధుడికి పూజలు నిర్వహిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి రాంరెడ్డి రంగారెడ్డి బిఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని వివిధ కాలనీలో నెలకొల్పిన గణనాథుల మండపాలను దర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షుడు వినయ్‌పటేల్ ఆధ్వర్యంలో బిఎన్‌రెడ్డినగర్‌లో బాలగంగాధర్ తిలక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహ్మాయాదవ్, శ్రీపాల్ రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఎల్‌బినగర్ ఎస్సీ సెల్ ఛైర్మన్ రాజశేఖర్, స్వర్ణమాధవి, గణేష్‌రెడ్డి, గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, లోకేష్, కవిత పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల, జడ్సీ సామ్రాట్ అశోక్

**మలక్‌పేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో సౌత్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్, వివిధశాఖ అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల నియోజకవర్గంలోని అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసి జయంత్, టౌన్ ప్లానింగ్ ఎసిపి ఫయీమ్, సెక్షన్ ఆఫీసర్లు ప్రకాష్, సునిత, ఇఇ మహబూబ్ పాష, అధికారులు వెంకన్న, గోవింద్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పెన్షన్ కార్డులు : కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** సైదాబాద్‌డివిజన్‌కు చెందిన వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్ కార్డులను లబ్దిదారులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ మధుసూధన్‌రెడ్డి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## వినాయకునికి కార్పొరేటర్ దంపతుల పూజలు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ సాయినగర్ కాలనీలో ప్రతిష్టించిన గణనాథునికి స్థానిక 41వ డివిజన్ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జూపల్లి రాజేందర్, పలువురు కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు. పూజల అనంతరం గణేష్ మండప నిర్వాహకులు కార్పొరేటర్‌ను సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు.

## గణనాధుడికి అడిషనల్ కమీషనర్ పూజలు

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్‌డివిజన్ లక్ష్మినగర్ కాలనీలో అఖిల భారత గోసేవా ఫౌండేషన్, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గో ఆధారిత వ్యవసాయం చేస్తున్న గణనాధుడి మండపం వద్ద అడిషనల్ కమీషనర్ రమేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట ఎసిపి వెంకటరమణ, సైదాబాద్ ఎస్‌హెచ్ఓ సుబ్బరామిరెడ్డి, అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలతో పేదల జీవితాలలో వెలుగులు

**హయత్‌నగర్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతివర్గాల సంక్షేమంకోసం పాటుపడుతోందని పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావతివిజేందర్‌రెడ్డి అన్నారు. శాంతినగర్ కాలనీకి చెందిన సంక్రాంతి అరుణకు కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా మంజూరైె లక్షా 116 రూపాయలు చెక్కును కౌన్సిలర్ ఆమెకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాలలో వెలుగులు నింపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, మల్లేష్, అమ్రేష్, విజయ్, నర్సింహ, ప్రభాకర్ పాల్గొన్నారు.

## పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ: పద్మిని

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** గర్భిణులు తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలని శ్రీసాయినగర్ అంగన్‌వాడి కేంద్రం ఉపాధ్యాయురాలు సుంచు పద్మిని అన్నారు. పోషణమాసం సందర్భంగా శ్రీసాయినగర్ అంగన్‌వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పద్మిని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, మహిళలు, కిషోరబాలికలు పోషకాహారం ప్రాముఖ్యతను తెలుసుకొని ఆరోగ్య పరిరక్షణకోసం తప్పని సరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సుక్కుభాయి తదితరులు పాల్గొన్నారు.

## సస్పెండైన బిజెపి నాయకుల పునర్‌నియామకం

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** బిజెపి పార్టీలో సస్పెన్షన్‌కు గురైన నాయకులను పునర్‌నియామకం చేస్తూ బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. రెండు వర్గాలుగా ఉన్న బిజెపి నాయకులు ఓ వివాదం విషయంలో సస్పెండ్‌కు గురయ్యారు. కాగా శనివారం సస్పెన్షన్ ఎత్తివేస్తూ రంగారెడ్డి అర్బన్ జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు బాణాల ప్రవీణ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఆకుల అంజన్‌కుమార్, సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ల బిజెపి అధ్యక్షులు సిద్దేశ్వర్, రాములుయాదవ్, ఉపాధ్యక్షుడు యాదగిరిగౌడ్‌లను వారి పదవుల్లో కొనసాగిస్తూ జిల్లా అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు.

## విశేష పూజలందుకుంటున్న సియోరా గణపతి




ఘననాదుడికి పూజలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

**తార్నాక, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** వివిద ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపయ్యకు నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్ట్రీట్ నెం.5లో సియోరా గ్రూప్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య విశేషపూజలందుకుంటుండడంతో ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సియోరా గ్రూప్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ డైరెక్టర్స్ ఎ.ప్రకాష్, సిహెచ్.వంశి, లక్ష్మారెడివ్ద, టి. శ్రీనివాస్, సుబ్బారెడ్డి, సత్యనారాయణ, ముత్తయ్య, జానికి శ్రీనివాస్, ఎస్. మహేష్, సురేష్, శంకర్, యోగి, సందీప్, రమేష్, స్వామి, సదానందం, మహేందర్, మనోహర్, రషీద్, శ్రీరాము, ఎ.బాలక్రిష్ణతో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వినాయక మండపాలవద్ద వైభవంగా పూజలు



వినాయక మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని వినాయక మండపాలవద్ద పలువురు పార్టీ నేతలు పూజలు నిర్వహించారు. న్యూభరత్‌నగర్, సౌత్ స్వరూప్‌నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక మండపాలవద్ద ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సందర్శించి పూజలు నిర్వహించారు. న్యూభరత్‌నగర్ కాలనీ అధ్యక్షుడు కడిగే శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతితోపాటు, గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ఆకుల మహేందర్, అన్య బాలకృష్ణ, నిరంజన్‌చారి, టిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, లేతాకుల రఘుపతిరెడ్డి, గరిక సుధాకర్, వేముల సంతోష్‌రెడ్డి, టంటం వీరేష్, సూరం శంకర్, జెసిబి రాజు, నాగిరెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, సల్ల సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉప్పల్ శాంతినగర్, సాయిబాబా కాలనీ ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, కాలనీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.అదే విధంగా రామంతాపూర్ నెహ్రూనగర్‌లో కాలనీ సంఘం వినాయక మండపం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణివెంకట్రావ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షుడు డి.సురేష్, ముత్తినేని జగదీష్, తూట్ నరసింహ, బాలరాజు, కృష్ణగౌడ్, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను బిసి వెల్ఫేర్ సంస్థ ఆదుకోవడం ప్రశంసనీయం: కార్పొరేటర్



పేద బిసి ప్రతిభ గల విద్యార్థిని అభినందిస్తున్న కార్పొరేటర్ శంకర్

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో బిసి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ చేస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని కార్పొరేషన్ బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక 6వ డివిజన్ కార్పొరేటర్ దడిగ శంకర్ అన్నారు. గుర్రంగూడకు చెందిన ప్రతిభ గల పేద విద్యార్థి ప్రశాంత్ చదువునిమిత్తం బిసి వెల్ఫేర్ సంస్థ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఈ సాయాన్ని కార్పొరేటర్ శంకర్ చేతుల మీదుగా శనివారం సదరు విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత రెండేళ్ల నుండి పేద విద్యార్థుల ఫీజులకు సంస్థ సాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దడిగ రమేష్, మధుబాబు, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## గణపతి ఉత్సవాల్లో అన్న ప్రసాద వితరణ



అన్న ప్రసాదం అందజేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి, గణేష్‌నేత

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** ఆర్కెపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భాస్కర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, బండి మధుసూదన్, పెద్దవూర సైదులు, బాలుయాదవ్, చిన్న, అనిల్, రాఘవేందర్, శివ, సాయికృష్ణ, అయప్ప పాల్గొన్నారు.

## గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజలు :
### - కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి



అన్నదాన కార్యక్రంలో పాల్గొన్న కార్పొరేటర్ కార్పొరేటర్ మీనాఉపేందర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జెజె నగర్ జై భవాని కార్ల యజమానుల ఆధ్వర్యంలో యాప్రాల్ రిజిస్ట్రేషన్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అన్ని కాలనీలలో గణపతి నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, శ్యామ్, నర్సింగ్, సౌరవ్, సుధాకర్ రెడ్డి, నాయకులు చెన్నారెడ్డి పాల్గొన్నారు. **వినాయక్‌నగర్ డివిజన్‌లో...** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన గణపతులకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. **శ్రీ సాయినగర్‌లో..** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి కాలనీ కార్యదర్శి బుగ్గ ఉపేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## యువత దేశానికి మంచి పేరు తేవాలి : సూపరింటెండెంట్ శివకుమార్

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో, యూరప్‌లోని ఎల్‌బ్రస్ పర్వతాలను అధిరోహించిన నితిన్, చంచలగూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శివకుమార్ పర్వతారోహకుడు నితిన్‌కు శాలువాకప్పిఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ యువత దేశానికి మంచి పేరు తెచ్చేలా ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండ యాదగిరి, గౌర శ్రీనివాస్ కురుమ, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడికి ఉప్పల ప్రత్యేక పూజలు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రుల సందర్భంగా గణేశుడికి రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త శనివారం పూజలు నిర్వహించారు. నాగోల్, మోహన్‌నగర్, శ్రీసాయినగర్‌కాలనిలో గణేష్‌ను శ్రీనివాస్‌గుప్తా దర్శించుకోగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వి.దామోదర్, సమ్మయ్య, మణికంఠ, శ్రావణ్, మణి, శ్రీనివాస్ సిద్దుల, సుజిత్‌యాదవ్, సాయి, ప్రకాష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన పనులకు తిరిగి కార్పొరేటర్ కొబ్బరికాయలు కొట్టడం విడ్డూరం
### -చంపాపేట డివిజన్ టిఆర్ఎస్ నాయకులు

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌లో ఎమ్మెల్యే శంకుస్థాపన చేసిన కార్యక్రమాలకే కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి తిరిగి శంకుస్థాపనలు చేయడం విడ్డూరమని డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శంకుస్థాపన లసమయంలో అధికారులు కార్పొరేటర్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ రాకుండా తర్వాత వాటికే తిరిగి కొబ్బరికాయలు కొట్టడం అర్థరహితమని వారు విమ



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు రాజిరెడ్డి

ర్శించారు. ఇది ఇతరులు తిన్నకంచం కడుగకుండానే మళ్లీ తిన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేపై అనవసర విమర్శలు, అసత్య ఆరోపణలు చేయడానికే కార్పొరేటర్ వంగ మధు పరిమితమయ్యారే తప్ప ఇప్పటి వరకు ఆయన డివిజన్‌లో ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదన్నారు. ఐకమత్యంగా ఉన్న కాలనీలలో గ్రూపు రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకోవడానికి బిజెపి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. బడంగ్‌పేటలో రియల్ కాంట్రాక్టర్ ఆత్మహత్య కేసులో నిందితుడిగా వంగ మధు పేరు ఉందని, అలాంటివ్యక్తి నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు, అవాకులు చవాకులు పేలితే టిఆర్ఎస్ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కేవలం ఎమ్మెల్యేను విమర్శిస్తే రాజకీయంగా ఎదుగుతామని వంగ మధు అనుకుంటున్నారని, అయితే ప్రజలు అంతా గమనిస్తున్నారని, తగిన సమయంలో వారే తగిన బుద్ధి చెబుతారని రాజిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు టిఆర్ఎస్ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రధాన రోడ్డును వంద ఫీట్లు చేయాలి : సంక్షేమ సంఘాలు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రధాన రోడ్డును భవిష్యత్ తరాల వారి కోసమైనా విశాలంగా వంద ఫీట్ల రహదారిగా విస్తరించి అభివృద్ధి చేయాలని కార్పొరేషన్‌లోని వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితాఇంద్రారెడ్డిని కోరారు. కార్పొరేషన్‌లో జిల్లెలగూడ అంబేద్కర్ చౌరస్తా నుండి జిల్లెలగూడ, మీర్‌పేట్‌ల మీదుగా కార్పొరేషన్ సరిహద్దు అల్మాస్‌గూడ కమాన్ వరకు ఉన్న ప్రధాన రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని సీతాహోమ్స్, టిఎస్‌ఆర్‌నగర్, న్యూ బాలాజీనగర్ తదితర కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు జిల్లెల ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, యాదయ్య, సురేందర్‌రెడ్డి, మాసాపేట శ్రీనివాస్‌రెడ్డి, అశోకచక్రవర్తి, గోవర్ధన్, మోహన్ నారాయణ తదితరులతో పాటు మహిళా సంఘాలకు చెందిన పలువురు మహిళలు స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని గతంలోనే సబితారెడ్డి రోడ్డు విస్తరణ చేయాలని నిర్ణయించారని వారన్నారు. అయితే అప్పట్లో జరగని విస్తరణ ప్రస్తుతం జరుగుతుండడం సంతోషకరమని పేర్కొన్నారు. కాగా రోడ్డు విస్తరణ ఉద్దేశ్యాన్ని పక్కన బెట్టి కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రోడ్డు విస్తరణలో ఇష్టారాజ్యంగా మార్పులు చేయాలని అధికారులపై ఒత్తిడి చేయడం తగదని వారు తెలిపారు. ఇప్పటికే మీర్‌పేట్, జిల్లెలగూడ ప్రధాన రహదారి ట్రాఫిక్‌తో ఇరుకుగా ఉందని వారు ఆందోళన చేశారు. ఇప్పటికైనా అందరూ సహకరించి రోడ్డును వంద ఫీట్లుగా విస్తరించి అభివృద్ధి చేయడానికి సహకరించాలని వారు కోరారు. ఈ మేరకు మంత్రి, అధికారులు చర్యలు తీసుకొని రోడ్డు అభివృద్ధిని వంద ఫీట్లుగా నిర్మింపజేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు : చేతన

**ఉప్పల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్ పరిధిలో ఖాళీ స్థలాలలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హబ్సిగూడ గాంధీ గిరిజనబస్తీలో శానిటేషన్ డిఇ చందన, ఇతర సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో ప్రజలు రోడ్లపై ఎక్కడపడితే చెత్త వేయవద్దని, ప్రజలు స్వచ్ఛ ఆటో నిర్వాహకులకు చెత్త అందజేయాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే అధికారులు జరిమానా విధిస్తారని తెలిపారు. జనావాసాల మధ్య చెత్త వేయడం వల్ల దోమలు పెరిగి ఇబ్బందులు వస్తాయన్నారు. పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ రాజేశ్వర్‌రెడ్డి, మారయ్య, బిజెపి నాయకులు సంజయ్‌పటేల్, బానోతు పడితియా నాయక్, కనావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుకానగర్‌లో వైద్య శిబిరం విజయవంతం

**ఉప్పల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లో పార్లమెంట్ ఇంచార్జీ మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్రి అరుంధతి ఆసుపత్రి సౌజన్యంతో మహిళా భవన్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రులు ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో పలువురికి ఉచితంగా వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. నిరుపేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వి.బి.నరసింహ, కార్మిక విభాగం నాయకులు వేముల మారయ్య, కొండల్‌రెడ్డి, మాస శేఖర్, అండాలు, సరిత, విజయలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలంటేనే గుర్తుకు వచ్చేది వైఎస్ఆరే: సామిడి గోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** సంక్షేమ పథకాలంటేనే తెలుగు రాష్ట్ర ప్రజలకు డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారని మీర్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్ 13వ వర్ధంతి సందర్భంగా మందమల్లమ్మ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రూ.2 కిలో బియ్యం, ఫీజు రీయంబర్స్‌మెంట్, పేదలకు పింఛన్లు, జల యజ్ఞం తదితర పథకాలను అమలు చేసిన వైఎస్ చిరస్మరణీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండిరాళ్ళ రాజు, అంజన్‌కుమార్, ప్యాట జ్యోతి, నర్సింహ, రేణుకు, విమల, దీక్షిత్‌రెడ్డి, స్వామి నాయక్, గుమ్మల శ్రీకాంత్, బాలకృష్ణ, సిద్ధుచారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుడికి పోలీసు ప్రముఖుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎసిపి రాందాస్‌తేజ, కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త:** ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలో టిటిడి ఎక్స్ అఫీషియో సభ్యుడు పంతులు కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడి వద్ద దక్షిణమండలం డిసిపి, సుల్తాన్‌బజార్ ఎసిపి, మలక్‌పేట ఎసిపి, కాచిగూడ ఎసిపి, అసెంబ్లీ ఎసిపి, చిక్కడపల్లి, ఛాదర్ ఘాట్, సైదాబాద్ ఎస్‌హెచ్ఓలు సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్‌ల కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేత మధుకర్‌రెడ్డిల, మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డిలు పూజలు నిర్వహించారు.

## పేదల వైద్యానికి భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి : మంత్రి సబితారెడ్డి



లబ్దిదారుడికి చెకు క్కను అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:** పేద రోగుల వైద్యానికి భరోసా సిఎం రిలీఫ్ ఫండ్ అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన వృద్ధురాలు కె.నాగేశ్వరమ్మ తీవ్ర అనారోగ్యానికి గురవ్వడంతో వైద్య చికిత్సలు భరించలేని ఆమె కుటుంబ సభ్యులు కార్పొరేషన్ టిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు సిరూర్ బాలరాజ్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్ళగా స్పందించిన సబితారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్‌నుండి రూ.60 వేలను మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును జిల్లెలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగేశ్వరమ్మ కుమారుడు తాతారావుకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం సహాయ నిధి ద్వారా ఎంతో మందికి మేలు చేయడం జరుగుతున్నదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బండి నాగేశ్‌యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కమలానగర్ గణేష్‌ని దర్శించుకున్న ఎమ్మెల్యే



గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :** నగరంలో ప్రఖ్యాతిగాంచిన గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్లోని మహాగణపతిని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప భక్తసమాజం అధ్యక్షుడు తులసి శ్రీనివాస్ నేతృత్వంలో శనివారం గణపతి మండపం వద్ద కుంకుమ అర్చనలు, అయ్యప్ప పడిపూజ, గణపతి హోమము, కళ్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలు వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొనగా తులసి శ్రీనివాస్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిసినేపల్లి సుభాషినివెంకటేశ్వరరావు, వక్కలంక శ్రీనివాసరావు, మార్గం రమేష్, వన్నాడి శ్రీనివాస్, రమేష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

## దశలవారీగా వార్డు అభివృద్ధి : మర్రి మాధవి



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మాదవి తదితరులు

**తుర్కయంజాల్, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో 15 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సిసి రోడ్డు పనులకు కౌన్సిలర్ మర్రి మాధవి మహేందర్‌రెడ్డి ఇతర కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రాంరెడ్డి సహాయ సహకారాలతో వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, వార్డులో ఎటువంటి సమస్యలున్నా తమకు తెలియజేయాలని వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుంట ఉదయశ్రీగోపాల్‌రెడ్డి, రొక్కం అనితచంద్రశేఖర్‌రెడ్డి, రేవెల్లి హరిత యాదగిరి, కో ఆప్షన్ పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ సర్పంచి పూజారి శంకరయ్య, సామ భీమిరెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మర్రి శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, నరసింహ, పాల్గొన్నారు.

## గణనాథులకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి పూజలు



గణనాధుడికి పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** బియన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, బాలాజీనగర్, గాయత్రినగర్ ఫేస్ 3లో నెలకొల్పిన వినాయకులను డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనులలో ఆటంకాలు రాకుండా వినాయకుడి ఆశీస్సులతో విజయవంతం కావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, రాజుగౌడ్, రామయ్య, సుధాకర్, సత్యనారాయణ, సంతోష్‌రెడ్డి, బాషా, ఇందిరారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మహేష్‌గౌడ్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

## మల్టీమీడియా రంగంలో విస్తృతంగా ఉపాధి అవకాశాలు : వైస్‌ఛాన్స్‌లర్ దర్యనీరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైస్‌ఛాన్స్‌లర్ దర్యనీరావు తదితరులు

**మలక్‌పేట, సెప్టెంబరు 3 ప్రభాతవార్త :** మల్టీమీడియా రంగంలో యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ దర్యనీరావు, క్రియేటివ్ మల్టీమీడియా వ్యవస్థాపకుడు బుగ్గవీటి రాజశేఖర్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో పాల్గొని పలు బహుమతులు సాధించారన్నారు. అదే విధంగా బుగ్గవీటి రచించిన డిజిటల్ మీడియా ఆకర్షణీయమైన కెరీర్ అవకాశాలు అనే పుస్తకాన్ని వైస్ ఛాన్స్‌లర్ ఆవిష్కరించారు. గత నవంబర్‌లో మంత్రి కెటిఆర్ ఆవిష్కరించిన ఎగ్జైటింగ్ కెరీర్ ఇన్ డిజిటల్ మీడియా అనే పుస్తకాన్ని తెలుగు ఎడిషన్‌లో విడుదల చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుందర్‌కుమార్, గెమిట్రానిక్స్ సిఇఓ రజత్ ఓఝా తదితరులు పాల్గొన్నారు.